క్లుప్తంగా

పాలిసెట్‌కు అన్నీ ఏర్పాట్లు పూర్తి

కావలి రూరల్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్–2023 అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.సుశీల్ కుమార్‌ప్రియ మంగళవారం తెలిపారు. బుధవారం నిర్వహించే పరీక్షకు మొత్తం 786 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి.నాగరాణి అనుమతి మేరకు కావలిలో మొదటిసారిగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కావలిలోని పీబీఆర్ విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని, విద్యార్థులు 11 గంటల లోపే పరీక్ష కేంద్రానికి హాజరు కావాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమన్నారు. విద్యార్థులు హాల్ టికెట్, బాల్‌పాయింట్ పెన్, పెన్సిల్, ఎరైజర్, షార్ప్‌నర్ వెంట తీసుకెళ్లాలని, సెల్‌ఫోన్, క్యాలుకలేటర్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవన్నారు.

పుస్తకం మన నేస్తం



వేసవి శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అనంతసాగరం సర్పంచ్ శోభ

చేజర్ల(సోమశిల): ఒక మంచి పుస్తకం వంద మంది స్నేహితులతో సమానమని, మంచి స్నేహితుడు మన అభివృద్ధిని ,శ్రేయస్సును కోరుకొన్నట్లే పుస్తక పఠనం మనల్ని ఉన్నత స్థితికి చేరుస్తుందని అనంతసాగరం సర్పంచ్ బొర్రా శోభ అన్నారు. మంగళవారం అనంతసాగరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులకు చదువు ప్రాధాన్యతను ఆమె వివరించారు. దొరలు దోచ లేనిది, దొంగలు ఎత్తుకు పోలేనిది, బంధువులు పంచుకోలేనిది ఒక్క చదువు మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నారాయణరావు, సీఆర్‌పీ హహబూబ్ బాషా, విశ్రాంత ఉపాధ్యాయుడు పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శి మోహన్ కిషోర్, గ్రామస్తులు రాపూరు కొండారెడ్డి, రామిరెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

కోనకాలువ శుభ్రతకు చర్యలు



పనులు పరిశీలిస్తున్న ఈఓ నరసయ్య

ఉదయగిరి: ఉదయగిరి పట్టణ వాసుల దాహార్తి తీరుస్తున్న కోన కాలువ పరిశుభ్రతకు చర్యలు తీసుకున్నట్లు ఈఓ నరసయ్య తెలిపారు. ఆయన మంగళవారం కోనకాలువ వద్ద చేస్తున్న పరిశుభ్రత పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉదయగిరి దుర్గంపై ఉన్న పెద్దతొట్టి వద్ద నుంచి పట్టణం వరకు ఉన్న కోనకాలువ వెంబడి పిచ్చి మొక్కలు, కంపకర్ర చెట్లు పెరిగి ఆకులు కాలువల్లో అడ్డుపడి అపరిశుభ్రంగా తయారైందన్నారు. వాటిని పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కారు అదుపు తప్పి బోల్తా



బోల్తాపడి దెబ్బతిన్న కారు

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): నెల్లూరు–ముంబయి 67వ జాతీయ రహదారిపై మర్రిపాడు మండలం అల్లంపాడు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం తెల్లవారుజామున కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ఎదురుగా వస్తున్న గేదెను తప్పించబోయిన క్రమంలో బద్వేల్ నుంచి నెల్లూరు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

గ్రంథాలయ పోస్టర్ ఆవిష్కరణ

అనుమసముద్రంపేట: వేసవి కాలంలో విద్యార్థులు ఎండలకు తిరగకుండా ఉండేందుకు ఏఎస్‌పేట గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ భాండాగారి శ్రీనివాసరాజు తెలిపారు. మంశగవారం ఏఎస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ పోస్టర్‌ను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హమీద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకుని మంచి మంచి పుస్తకాలను చదవాలన్నారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే వేసవి శిబిరంలో కథలు, చిత్రలేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

కొంటే.. అవుట్



నారంపేట వద్ద ఎలాంటి వసతులు లేకుండా హద్దురాళ్లు పాతి అమ్మకానికి సిద్ధం చేసిన లేఅవుట్

- వ్యవసాయ భూమిలో అక్రమంగా లేఅవుట్ ఏర్పాటు
- కమర్షియల్ భూమిగా మార్పు చేయకుండానే ప్లాట్లు
- నోటీసులు జారీ చేసినా పట్టించుకోని యాజమాన్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేట బస్‌షెల్టర్ వద్ద 67వ నంబరు జాతీయ రహదారి పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్ ఏర్పాటు చేశారు. అయితే ఇటువంటి లే అవుట్‌ను నియంత్రించాల్సిన అధికారులు నోటీసులు ఇచ్చామని సరిపెట్టుకుంటున్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదే అదనుగా ఆకర్షణీయ ప్రకటనలతో కొనుగోలుదారులను మభ్యపెట్టి ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకునేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోంది.

మండలంలోని నారంపేట రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 170/2లో 13.47 ఎకరాల వ్యవసాయ పొలాన్ని కొందరు బృందంగా ఏర్పడి 2012లో కొనుగోలు చేశారు. అప్పట్లో సాగు భూమిగా ఉన్న పొలాన్ని వాణిజ్య అవసరాల కోసం కన్వెర్షన్ చేయాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే పొలం కొన్న భాగస్తుల మధ్య ఏర్పడిన ఆర్థిక విభేదాల కారణంగా పదేళ్లుగా వదిలేయడంతో ఏపుగా ముళ్లపొదలు పెరిగి ఆ ప్రాంతమంతా అడవిని తలపించేది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో కొందరు డెవలపర్ల భాగస్వామ్యంతో భూములు కొనుగోలు చేసిన వారు ముళ్లపొదలు తొలగించి చదును చేయించారు. స్థానికులు వ్యవసాయ అవసరాల కోసం ఆ భూమిని వినియోగిస్తారని భావించారు. అయితే నెల రోజుల వ్యవధిలోని ఆ భూమిలో అంతర్గత రోడ్లతో పాటు ప్లాట్లను విభజించి రాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. రెండు వారాల క్రితం జాతీయ రహదారి పక్కన తమ లేఅవుట్‌లో ఆకర్షణీయమైన బోర్డులు ఏర్పాటు చేసి చట్టబద్ధంగా అన్ని పత్రాలు ఉన్నాయని, అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఆ బోర్డుల్లో పొందుపరిచారు. దీంతో స్థానికులు గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులను ఆరా తీయగా ఆ లేఅవుట్‌కు సంబంధించి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తేల్చి చెప్పారు. అమాయక ప్రజలను మోసపుచ్చి లేఅవుట్ పేరుతో ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకొనేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన ప్రయత్నాలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు సార్లు నోటీసులు ఇచ్చాం

నారంపేట లేఅవుట్‌లో అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న విషయం తెలిసి ఇప్పటికే రెండు సార్లు నోటీసులు జారీ చేశాం. గ్రామ పంచాయతీ అనుమతి, నుడా అనుమతిగానీ లేకుండా లే అవుట్ ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. కాల పరిమితి లోగా తాము ఇచ్చిన నోటీసులకు సంబంధిత లేఅవుట్ యజమానులు సరైన సమాధానం ఇవ్వకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఉషారాణి, ఈఓపీఆర్డీ, ఆత్మకూరు

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సంగం: మండలంలోని మర్రిపాడు పల్లిపాళెంకు చెందిన కరకంబాకం హనుమంతరావుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.6 లక్షల చెక్‌ను మంగళవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బ్రహ్మణపల్లిలోని తన నివాసంలో అందజేశారు. రోడ్డు ప్రమాదానికి గురైన హనుమంతరావు కుటుంబ సభ్యులు లక్షలాది రూపాయలు ఖర్చు చేశారని, వారి కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగా లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ మారుబోయిన సురేష్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులను పరీక్షిస్తున్న పీహెచ్‌ఎన్ సుశీలమ్మ

వరికుంటపాడు: గర్భిణులు రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ లావణ్య, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ తెలిపారు. మంగళవారం వరికుంటపాడు పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షయోజన పథకం కింద 13 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవడంతో పాటు కాన్పులు కూడా చేయించుకోవాలన్నారు. పౌష్టికాహారం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజరు తేజస్విని, సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, సూపర్‌వైజరు రియాజ్ పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, నాయకులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సీఎం సూచనలకు అనుగుణంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అధికారులకు తెలిపారు. ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, కార్యాలయ సిబ్బంది, అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలో ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరేంద్ర, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, మేడా శ్రీనివాసులరెడ్డి, వెంకయ్య పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం సద్వినియోగం చేసుకోవాలి

సీతారామపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బిట్–1 సచివాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను 1902కు కాల్ చేసి సమస్యలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షాజియా, ఎస్సై కిషోర్‌బాబు, ఏఎస్‌ఓ సతీష్, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌ను సన్మానించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



నూతన కమిషనర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బల్లి నాగేశ్వరరావును స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పార్టీ నాయకులు ముజీబ్, కె చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్, కౌన్సిలర్ గంధళ్ల వేణు, కె కిషోర్‌రెడ్డి, తదితరులు ఆయన్ను కలిసి అభినందించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న అన్నారెడ్డిపాళెం పాఠశాల ఉపాధ్యాయ బృందం

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలో 500కు పైగా మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి భవిష్యత్‌లో బాగా చదవాలని ఆకాంక్షించారు. పాఠశాలకు చెందిన బొమ్మలాట కోటి భార్గవ్, బొమ్మలాట శివగీతిక, చెంబేటి హిమవర్థిని, బత్తల స్మైలీ, శ్రీనాథ్, శ్రీహరి, మనోజ్, నాగచైతన్య, కృష్ణవేణి 500కు పైగా మార్కులు సాధించడంతో వారిని అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

- మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నవరత్నాల పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం పూర్తి చేయించడంలో సచివాలయ సిబ్బంది చొరవ చూపాలని మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో సచివాలయాల సిబ్బంది, హౌసింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో మంగళవారం ఇళ్ల నిర్మాణాల మానిటరింగ్‌పై ప్రత్యేక హౌసింగ్ డీఈ నటరాజ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, వమిడిపాడులో ఏర్పాటైన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇప్పటికే పలు ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కొన్ని ఇళ్లు బేస్‌మట్టాల వరకే ఉండడం, మరికొన్ని లెంటల్ వరకు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఆ లబ్ధిదారులను గుర్తించి మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసేలా వలంటీర్ల సహకారంతో సచివాలయాల సిబ్బంది సమాయత్తం చేయాలని ఆయన కోరారు. జగనన్న కాలనీల్లో సిబ్బంది గుర్తించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పరంగా చేపట్టాల్సిన మౌలిక వసతుల ఏర్పాటు విషయంలో అశ్రద్ధ చేయొద్దని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా నీరు, విద్యుత్ సరఫరా విషయంలో జాప్యం ఉండరాదన్నారు. కొన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాని క్రమంలో మెప్మా సిబ్బంది వారిని కలిసి మాట్లాడి పొదుపు మహిళలు అయితే బ్యాంక్‌ల ద్వారా పావలా వడ్డీ రుణం ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్, మున్సిపల్ ఆర్‌ఐ ఖాసీం, మెప్మా అధికారులు అంకయ్య, అలిబేగ్, మాధవి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి సేవలో పొగాకు బోర్డు అధికారులు



పంచముఖ శక్తి గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పొగాకు బోర్డు అధికారులు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని డీసీపల్లిలో కొలువైన శ్రీపంచముఖ శక్తి గణపతి ఆలయంలో డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం ఫీల్డ్ ఆఫీసర్ ఆదర్స్, ప్రోగ్రెస్ టుబాకో కంపెనీ యజమాని కొప్పోలు సుబ్బారావు తదితరులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. జలాభిషేకం, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి పొశర్లపూడి వెంకటేశ్వర్లు, వేద పాఠశాల విద్యార్థులు పొశర్లపూడి సురేంద్ర, పొశర్లపూడి సుదర్శన్ ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేక సేవల్లో పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



బ్రాహ్మణపల్లిలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సీతాదేవి శ్రీరామచంద్రునితో పరిణయ ఘట్టాన్ని ఆలయ పూజారులు అద్భుతంగా భక్తులకు వివరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు భక్తులు కానుకలు సమర్పించారు. అనంతరం విశేష పుష్పాలంకరణతో సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

- కనబడిన వారిపై దాడులు, దోపిడీ

కావలి రూరల్: మత్తుకు బానిసలై యువకులు పట్టణంలో బైక్‌లపై తిరుగుతూ కనబడిన వారిపై దాడులు చేస్తూ వారి వద్ద నగదు, వస్తువులు దోచుకున్న ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. 1వ పట్టణ సీఐ కె.శ్రీనివాసరావు వివరాల మేరకు.. పట్టణంలోని మానస థియేటర్ సెంటర్‌లో నివసిస్తున్న తాళ్లూరు వెంకట సత్యనారాయణ హోల్‌సేల్ దుస్తుల దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. తన దుకాణంలోని దుస్తులను సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు వంటి ప్రాంతాల్లోని వ్యాపారులకు ఇచ్చి వారానికి ఒకసారి కలెక్షన్ తెస్తుంటాడు. సోమవారం కలెక్షన్‌కు వెళ్లిన వెంకట సత్యనారాయణ రాత్రి రైలు దిగి రైల్వే రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి అతనిపై దాడి చేసి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు మంగళవారం 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని వాయినందన ప్రెస్ వీధికి చెందిన షేక్ మస్తాన్ మంగళవారం తెల్లవారుజామున రైలు కట్టవద్దకు బహిర్భూమికి వెళ్తుండగా మానస క్యాంటీన్ వద్ద రాగానే ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి ఆయనపై దాడి చేసి ఆయన వద్ద ఉన్న రూ.150 తీసుకెళ్లారు. అన్నపుగుంట వద్ద యాచకుడిపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.50 లాక్కున్నారు. మత్తుకు బానిసలైన యువత ఇలాంటి దారి దోపిడీలకు పాల్పడుతుండడంతో పట్టణ ప్రజలు భయాందోళనలో ఉన్నారు.

పీఏసీఎస్‌లో డీసీఓ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీసీఓ సుధా భారతి

కావలి: మండలంలోని సర్వాయపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీని జిల్లా సహకార శాఖ అధికారి సుధాభారతి మంగళవారం ఆకస్మికంగా చేశారు. సొసైటీకి సంబంధించిన నగదు పుస్తకాలు, రుణాల తదితర రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను బలోపేతం చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురగాని బ్రహ్మయ్య, కావలి సబ్‌డివిజన్ అధికారి ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

12న మండల సమావేశం

ఉదయగిరి: ఉదయగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న స్థానిక స్త్రీశక్తి భవనంలో జరుగుతుందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు దండోరా వేయించాలి

- ఎస్‌ఆర్‌పీ మురాద్



మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పీ మురాద్

చేజర్ల(సోమశిల): గ్రామ సభలు ప్రజలకు తెలిసేలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు దండోరా వేయించాలని స్టేట్ రీసోర్స్ పర్సన్ మురాద్ అన్నారు. మంగళవారం అనంతసాగరం మండలంలోని వైకేపీ కార్యాలయంలో డీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం ఆడిట్‌కు సంబంధించి గ్రామ సభలకు ఒక్క రోజు ముందే ప్రజలకు తెలిసేలా దండోరా వేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.8 కోట్ల మేర పనులు జరిగినట్లు తెలిపారు. పెద్ద గ్రామాల్లో మూడు రోజులు, చిన్న గ్రామాల్లో రెండు రోజుల పాటు డీఆర్పీలు ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారని, నాలుగో రోజు గ్రామ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దయాసాగర్ పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏఎస్‌పేట ఎంపీపీ పద్మజారెడ్డి

అనుమసముద్రంపేట: నీటి నాణ్యత తెలిపే జలజీవన్ మిషన్‌పై ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి శర్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయిలు వేయించడమే జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పరిసరాలు, పరిశుభ్రత బాగుంటేనే తాగునీరు కూడా బాగుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఏఓ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎస్‌జీఓ వెంకట్రావు, హరీష్‌బాబు, గణేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం



ప్రత్యేకలంకరణలో దేవదేవేరులు



వసంతాలు చల్లుకుంటున్న గ్రామస్తులు

వింజమూరు(ఉదయగిరి): నల్లగొండ్ల క్షేత్రంలో జరుగుతున్న లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహిస్తూ వసంతోత్సవం నిర్వహించారు. యువకులు వసంతాలు ఉత్సాహంగా చల్లుకుంటూ సందడి చేశారు. వసంతోత్సవానికి ఉభయకర్తలుగా ఏ.వెంకటేశ్వరరావు, రవిప్రసాద్ వ్యవహరించారు. బుధవారం ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త మోహన్‌రెడ్డి తెలిపారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్‌గా అంకబాబు



నియామక పత్రం అందుకుంటున్న అంకబాబు

పొదలకూరు : వికలాంగ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్‌గా పొదలకూరు మండలం నల్లపాళెనికి చెందిన టి.అంకబాబును నియమిస్తూ మంగళవారం సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.చిన్నసుబ్బయ్య యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు జిల్లా, నగర, నియోజకవర్గ, మండలాల కమిటీలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా వీహెచ్‌పీఎస్ కన్వీనర్ అంకబాబు ఆధ్వర్యంలో అన్ని కమిటీలను నూతనంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

సీతారామపురం: గ్రంథాలయంలో పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, విజ్ఞానం పెంపొందాలని గ్రంథాలయ అధికారి ఫజులుల్లా పేర్కొన్నారు. సీతారామపురంలో మంగళవారం గ్రంథాలయం విశిష్టతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో ప్రజలకు ఎన్నో విషయాలు తెలుస్తాయని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



జ్యోషికతో లక్ష్మీదేవి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని యాదవ బజారుకు చెందిన లక్ష్మీదేవి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు. లక్ష్మీదేవి తల్లిదండ్రులు రమణమ్మ, ఓబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుటుంబంలో మనస్పర్థల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. చంటిబిడ్డ జ్యోషికను కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.